సాక్షి చిత్తూరు

శుక్రవారం । 2 । మే । 2025



పకడ్బందీగా కిశోరి వికాస శిక్షణ

జిల్లాలో కిశోరి వికాసం వేసవి శిక్షణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. - 8లో



పోరంబోకు భూమి ఆక్రమణ

గంగాధర నెల్లూరు మండలంలోని వింజం గ్రామంలో పోరంబోకు భూమిని ఓ టీడీపీ నేత ఆక్రమించుకున్నారు. - 8లో



క్రీడలతో ఉజ్వల భవిత

విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఇక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని సప్తగిరి గ్రామీణ బ్యాంక్ పేరు గురువారం నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ పేరుగా మారింది. త్వరలో ప్రధాన కార్యాలయం నుంచి బ్రాంచ్ కార్యాలయం వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని బ్రాంచ్‌ల పేర్లను మార్చనున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు కృష్ణా జిల్లాలో 264 బ్రాంచ్‌లు ఉన్నాయని బ్యాంక్ అధికారులు తెలిపారు. ఒకప్పటి శ్రీవెంకటేశ్వర గ్రామీణ బ్యాంకు, కనకదుర్గ గ్రామీణ బ్యాంకు కలిసి 2006లో సప్తగిరిగా మారాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా సేవలు అందించనుంది.

పౌల్ట్రీరంగంతో ఉపాధి కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో పౌల్ట్రీ రంగంతో ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖ, పాడిపరిశ్రమ, పౌల్ట్రీ రంగం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు వ్యవసాయ రంగంతోపాటు పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగాల్లోని ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ అవకాశాలతో ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. వ్యవసాయ రంగంతోపాటు పాడి పరిశ్రమ, పౌల్ట్రీ రంగాల్లో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పౌల్ట్రీ రంగంలో ఆసక్తి ఉన్న రైతులకు నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సహకారంతో ముందుగా పౌల్ట్రీ రంగంలో విజయవంతమైన రైతులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ రంగంలో ఆసక్తి ఉన్న రైతులకు పౌల్ట్రీ ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సాయం బ్యాంకర్లతో అందించేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఇందుకు అవసరమైన డీపీఆర్‌లను సిద్ధం చేసుకోవాలని అధికారులను సూచించారు.

కాంట్రాక్ట్ అధ్యాపకులకు వేతన వెతలు

గుడుపల్లె: రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కళాశాలలో కాంట్రాక్ట్ అధ్యాపకులుగా పనిచేస్తున్న 3,618 మందికి ఏడాదిగా జీతాలు అందలేదని ఆ యూనియన్ ఉపాధ్యక్షుడు నౌషద్ ఖాన్ పేర్కొన్నారు. 2024 సంవత్సరం మే నెల నుంచి ఇప్పటి వరకు జీతాలు అందలేదన్నారు. పెండింగ్ జీతాలు చెల్లించి, వచ్చే విద్యా సంవత్సరానికి రెన్యూవల్ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రికి, ఉన్నతా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

తిరుపతి శ్రీనివాస బస్టాండ్ వద్ద బస్సులు లేక పడిగాపులు కాస్తున్న ప్రయాణికులు



అమరావతి.. పోతోంది మతి!

ఎంకి పెళ్లి సుబ్బిగాడి చావుకొచ్చినట్టుగా మారింది అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం. నేడు జరగనున్న ప్రధాని పర్యటనకు యంత్రాంగం భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టింది. అమరావతికి రాకుంటే సంక్షేమ పథకాలు రావని హెచ్చరికలు జారీచేయడంతో డ్వాక్రా మహిళలకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. మొదలే ఎండలు.. ఆపై ఉక్కపోతతో జనం విలవిల్లాడుతున్న తరుణంలో అమరావతికి వెళ్లిరావడం చావుకు ఎదురెళ్లడమే అవుతోంది. మధ్యలో జరగరానిదేమైనా జరిగితే ఎవరు బాధ్యులో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనికితోడు చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి భారీ ఎత్తున బస్సులు కేటాయించడంతో ప్రయాణికులు నరకం అనుభవించాల్సి వస్తోంది. 'అమరావతీ.. పోతోంది మతి' అంటూ జనం చర్చించుకోవడం కనిపించింది.

- ప్రధాని అమరావతి పర్యటనకు భారీగా జనసమీకరణ
- 145 ఆర్టీసీ, మరో 20 ప్రైవేటు బస్సుల ఏర్పాటు
- ప్రతి బస్సుకు 50 మంది చొప్పున ఎక్కాల్సిందే
- ఒక్కో మహిళకు రూ.500, రెండు రోజులు భోజన వసతి
- ప్రతి డ్వాక్రా సంఘం నుంచి సభ్యులు రావాల్సిందే
- లేకుంటే సంక్షేమ పథకాలు రావని హెచ్చరికలు
- కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్లు, డ్వామా పీడీ, ఏడీలకు బాధ్యతలు
- ఎండ వేడిమికి బస్సులు లేక ప్రయాణికుల తిప్పలు



స్కూటరెక్కైనా సీటు సంపాదించాల్సిందే

సాక్షి ప్రతినిధి, తిరుపతి: అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున జనసమీకరణ చేపట్టింది. నేడు ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా శ్రీకారం చుట్టనున్న ఈ కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు జిల్లాల నుంచి జనాలను తరలించేందుకు సిద్ధమైంది. జనాలను తీసుకెళ్లి తీసుకొచ్చే బాధ్యతలను ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగానికి అప్పగించింది. తిరుపతి, చిత్తూరు జిల్లా నుంచి జనాలను తరలించేందుకు 145 ఆర్టీసీ, మరో 20 ప్రైవేటు బస్సులను కేటాయించింది. ఒక్కో బస్సుకు 50 మంది చొప్పున 8,250 మందిని తరలించాలని అంచనా. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి 10 నుంచి 12 బస్సులు కేటాయించినట్లు సమాచారం.

అమరావతికి వస్తే దుర్గమ్మ దర్శనం ఫ్రీ!

పట్టణాల్లో డ్వాక్రా సభ్యులు అమరావతికి వస్తే కనకదుర్గమ్మ దర్శనం చేయిస్తామని చెప్పినట్లు తిరుపతి నగరంలో ప్రచారం జరుగుతోంది. అమరావతి సభకు వచ్చే ప్రతి ఒక్కరికీ రూ.500 ఇస్తామని హామీ ఇచ్చినట్లు సభ్యులు చెబుతున్నారు. అదేవిధంగా గురువారం రాత్రి నుంచి శనివారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకునే వరకు వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నారు.

బస.. ఏందీ గోస?

తిరుపతి, చిత్తూరు నుంచి వెళ్లే వారికి ఒంగోలులో గురువారం రాత్రికి ఓ ప్రైవేటు కళాశాలలో బస ఏర్పాటు చేశారు. వీరంతా శుక్రవారం ఉదయం టిఫిన్ అయ్యాక నేరుగా అమరావతికి చేరుకుంటారు. ఒక్కో బస్సుకు 120 ఆహార పొట్లాలు, వందకుపైగా అరటి పండ్లు, 120 వాటర్ బాటిళ్లు, 60 ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా కిచిడీ, చట్నీతో పాటు ఒక ఆరెంజ్ పండు అందించనున్నట్లు అధికారులు చెప్పారు. ఈ ఏర్పాట్లన్నీ పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు సమాచారం. అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మార్గ మధ్యంలో ఆరోగ్య కేంద్రాలకు తరలించడం జరుగుతుందన్నారు. తిరుపతి, చిత్తూరు నుంచి బయలుదేరిన వారంతా శుక్రవారం 12 గంటలకు అమరావతి సభకు చేరుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.

డ్వాక్రా సభ్యులు రాకపోతే సంక్షేమ పథకాలు కట్!



అమరావతిలో నిర్వహించే కార్యక్రమానికి ఎక్కువ శాతం డ్వాక్రా మహిళలను తరలించారు. ఆయా గ్రామాల్లో ఉండే సంఘ మిత్రకు బాధ్యులు అప్పగించారు. ఆమె డ్వాక్రా లీడర్లను పురమాయించారు. ప్రతి గ్రూపు లీడర్లు తప్పని సరి. గ్రూపులోని సభ్యులు రాకపోతే వారికి సంక్షేమ పథకాలు అందవని లీడర్లు, వెలుగు సిబ్బంది చేత హెచ్చరికలు జారీ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

అధికారులందరికీ బాధ్యతలు



జిల్లాల నుంచి జనాలను తీసుకెళ్లి తీసుకొచ్చే బాధ్యతలను ప్రభుత్వం కలెక్టర్‌కు అప్పగించారు. ప్రతి నియోజక వర్గానికి ఆర్డీఓ లేదంటే కార్పొరేషన్, మున్సిపల్ కమిషనర్, డ్వామా పీడీ, మార్కెటింగ్ శాఖ ఏడీకి బాధ్యతలు అప్పగించారు. కిందిస్థాయి అధికారులు కొందరిని అమరావతిలో భోజన వసతి ఏర్పాట్లు చూసుకోమని బాధ్యతలు అప్పగించినట్లు అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇవి కాకుండా కూటమి నేతలు నాయకులకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు.

బస్సులు లేక అవస్థలు



అస్సో..బస్సో: బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్న ప్రయాణికులు

అమరావతి పునర్నిర్మాణానికి ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా తంటాలు ఎదుర్కొంటున్నారు. బస్సులు అమరావతి కార్యక్రమానికి తరలించిన విషయం తెలియక అనేక మంది ప్రయాణికులు తిరుపతి, చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు కాస్తున్నారు. వచ్చిన ఒకటీ అర బస్సుల్లో ప్రయాణించేందుకు జనం పోటీపడుతున్నారు. ఫలితంగా తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. బస్సుల్లో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. ఆర్టీసీ బస్సులు అమరావతి కార్యక్రమానికి కేటాయించటంతో శుక్ర, శనివారాలు కూడా తిప్పలు తప్పవని ఆవేదన చెందుతున్నారు.



రక్తపు రంగు కొళాయి నీరు

తాగునీరు.. తాగ లేరు!

- జలం..గరళం
- కొళాయిల్లో కలుషిత నీరు

నగరి : మున్సిపల్ ప్రజలకు మున్సిపాలిటీ వారు సరఫరా చేసే తాగునీరు గురువారం ఏకాంబరకుప్పం పరిధిలో రంగు మారి పింక్ కలర్‌లో రావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆ నీటిని ఎలా వాడాలంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా డైయింగ్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే హానికర రసాయన రంగునీటి కారణంగా ఇప్పటికే భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. దీంతో బోర్లలో వచ్చే నీరు తాగడానికి వీలుపడదు. మున్సిపాలిటీ వారు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి సరఫరా చేసే నీరే అందరూ వినియోగించుకుంటున్నారు. అయితే కొళాయిల్లో వచ్చే నీరు కూడా రసాయన రంగుల్లో వస్తుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చేసేదేమీలేక... ప్రైవేటు వాటర్ ప్లాంట్లకు క్యూ కడుతున్నారు.



కొళాయిపైపు నుంచి రంగుమారి వస్తున్న నీరు

భక్తుల ప్రాణాలంటే లెక్కలేదా?

కార్వేటినగరం/వెదురుకుప్పం: భక్తుల ప్రాణాలంటే కూటమి ప్రభుత్వానికి లెక్కలేదని మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం పుత్తూరు ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి భక్తుల ప్రాణాలతో చెలగాటం ఆడటం పరిపాటిగా మారిందన్నారు. 2015లో చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చితో 29 మంది భక్తులు, అలాగే 2016లో తిరుమల క్యూలో విద్యుత్ షాక్‌తో ఇద్దరు భక్తులు, 2018లో ఒంటిమిట్టలో కళ్యాణోత్సవంలో విద్యుత్ షాక్‌తో నలుగురు, 2025 తిరుపతిలో వైకుంఠ ఏకాదశి రోజున ఆరుగురు, నేడు సింహాచలంలో కమీషన్లకు కక్కుర్తిపడి నాసిరకం పనులతో గోడ నిర్మించడంతో 8 మంది ప్రాణాలను పొట్ట పెట్టుకున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుతానన్న పవన్ భక్తులు ప్రాణాలను ఎందుకు కాపాడ లేదని, మరణించిన వారి కుటుంబాలను ఎందుకు ఓదార్చలేదని ప్రశ్నించారు.

సంక్షేమం శూన్యం.. అభివృద్ధీ అతీగతి లేదు

కూటమి సర్కారు పది నెలలుగా ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదు. అభివృద్ధి అతీగతీ లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వ్యాఖ్యానించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ డాక్టర్స్ విభాగం అధ్యక్షుడిగా కోలార్ ప్రకాష్‌ను నియమించడంతో గురువారం ఆయన నాయకులతో వెళ్లి పుత్తూరులో ఉన్న మాజీ మంత్రి నారాయణస్వామిని కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మీడియాతో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ జరిగిందో అర్థం కావడం లేదన్నారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అధికారులు ఏకపక్ష ధోరణితో పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు శివాజీ, మండల ఉపాధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు నరేష్ రెడ్డి, నాయకులు పురంధర్‌రెడ్డి, రాము, మురళీ,వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వారంతా పల్లెనాడి పట్టే చిరుద్యోగులు.. నిత్యం పల్లెల్లో పేదలకు వైద్యసేవలు అందించడంలో శ్రమిస్తుంటారు. వారిని సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. పరిష్కరించమని కూటమి సర్కారుకు విన్నవించారు. పట్టించుకున్న పాపాన పోలేదు. తొలుత శాంతియుత పోరాటం చేశారు. అయినా ప్రయోజనం శూన్యం. దీంతో నిరవధిక సమ్మె సైరన్ మోగించారు.

సమ్మెలో సీహెచ్‌ఓలు



కూటమిపై సీహెచ్‌ఓల సమ్మెట

- జిల్లాలో సీహెచ్‌ఓల నిరవధిక సమ్మె
- విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వెలవెల
- సేవలు అందక పల్లె ప్రజలకు పాట్లు
- దిగిరాని ప్రభుత్వం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): డిమాండ్ల సాధనకు మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సీహెచ్‌ఓలు (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వెలవెలబోతున్నాయి. వైద్య సేవలు అందక పల్లె ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. చికిత్స కోసం పీహెచ్‌సీ, ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆస్పత్రులు ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం దిగిరాకపోవడంతో సీహెచ్‌ఓలు రోడ్డెక్కారు. వినూత్నరీతిలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నిరసనలతో హెరెత్తిస్తున్నారు. వామ పక్ష పార్టీలు కూడా మద్దతు పలుకుతున్నాయి. జిల్లాలో 464 విలేజ్ హెల్త్ క్లినిక్‌లున్నాయి. ఇందులో 14 రకాల వైద్యపరీక్షలు, 105 రకాల మందులు, 67 రకాల వైద్య పరికరాలను అప్పటి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన వారిని సీహెచ్‌ఓలుగా నియమించింది. జిల్లా వ్యాప్తంగా 451 మంది సీహెచ్‌ఓలు విశేష సేవలందిస్తున్నారు. అయితే వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సేవలిలా..

మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, సీహెచ్‌ఓలు పల్లెల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే రోగులకు సాధారణ జబ్బులతోపాటు దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్‌కు సైతం వైద్యపరీక్షలు చేసి, మందులు ఇచ్చేవారు. పిల్లలు, గర్భిణులకు పరీక్షలు చేసి, చికిత్స చేసేవారు. రోగికి వచ్చిన వ్యాధిపై ఏదైనా అనుమానం ఉంటే వెంటనే పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్రంలోని టెలి మెడిసిన్ సెంటర్‌లోని వైద్యులకు ఫోన్ చేసి రోగులతో మాట్లాడించి చికిత్స చేయించారు. దీంతో రోగులు సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే అవసరం తప్పేది. అలాగే విలేజ్ హెల్త్‌క్లినిక్‌కు రాలని రోగులకు ఇంటికెళ్లి పరీక్షలు చేసి, మందులు, మాత్రలు ఇస్తున్నారు. టీకాలు వేయించడంలో ముందుండి పనిచేస్తున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తున్నారు. ఎన్‌సీడీ సర్వేలో ఏఎన్‌ఎంలతో సమానంగా సీహెచ్‌ఓలుగా కీలకంగా వ్యవహరించారు. కానీ వీరిని సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. దీంతో వీరు తమ సమస్యల పరిష్కారానికి రోడ్డెక్కారు.

జిల్లా వివరాలు	
పీహెచ్‌సీలు:	50
విలేజ్‌హెల్త్ క్లినిక్‌లు:	464
సీహెచ్‌ఓలు:	451
సమ్మెకు ముందు రోజువారీ ఓపీల సంఖ్య(సుమారు):	9,280

నిరవధిక సమ్మెలోకి...

ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్– కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓలు గతనెల 16వ తేదీ నుంచి జిల్లా వైద్య ఆరోగ్య కేంద్రం ఎదుట శాంతి యుతంగా నిరసన చేపట్టారు. 27వ తేదీ జిల్లా అధికారులకు నోటీసులిచ్చి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. దీంతో 28వ తేదీ నుంచి గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సీహెచ్‌ఓలు వెళ్లడం లేదు. దీంతో పల్లె ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ జబ్బులతో పాటు పిల్లలు, గర్భిణులకు వైద్యం కోసం సూదూరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

డిమాండ్లు ఇవీ..

- ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి.
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి.
- పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి.
- ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలి.
- క్లినిక్‌ల అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరించాలి.
- నిర్దిష్టమైన జాబ్ చాటర్ అందించాలి.
- ఎఫ్‌ఆర్‌ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలి.
- హెచ్‌ఆర్ పాలసీ, ఇంక్రీమెంట్లు, బదిలీలు, పితృత్వ సెలవులు తదితరాలను త్వరితగతిన అమలు చేయాలి.



సమ్మెలో సీహెచ్‌ఓలు

పీఆర్సీ ఇవ్వాలి



సీహెచ్‌ఓల జీత భత్యాలు ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన ఎంఎల్‌హెచ్‌ఎపీలను రెగ్యులర్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. జీఓ నంబర్ 64 ప్రకారం ఎన్‌హెచ్‌ఎంలో అన్ని కేడర్ల ఉద్యోగులకు 23 శాతం పీఆర్సీ ఇవ్వాల్సి ఉంది. 189 కేడర్లకు ఇచ్చి సీహెచ్‌ఓలకు మాత్రం ఇవ్వలేదు. అందరికీ పీఎఫ్ ఇస్తున్నా మాకు మాత్రం ఇవ్వడం లేదు.

– రషీద్, సీహెచ్‌ఓ

డిమాండ్ల సాధనకే సమ్మె



జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలనే ప్రధానమైన డిమాండ్‌తో సమ్మెకు దిగాం. మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తొలుత శాంతియుతంగానే నిరసన చేపట్టాం. ఈ నిరసనతో ఫలితం లేకపోవడంతో నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఈనెల 28వతేదీ నుంచి సమ్మె కొనసాగుతోంది. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు.

– భానుప్రియ, ఉపాధ్యక్షురాలు, ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్, సీహెచ్‌ఎ అసోసియేషన్, చిత్తూరు

ఇంక్రిమెంట్లు ఇవ్వాలి



ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కారానికి హామీ ఇవ్వాలి. ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాల్సి ఉన్నా చేయడం లేదు. మా డిమాండ్లు పరిష్కరం అయ్యేంత వరకు ఈ నిరవధిక సమ్మె ఆగదు.

– మోహనకుమారి, సభ్యురాలు, ఏపీ మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ సీహెచ్‌ఎ అసోసియషన్, చిత్తూరు

క్లుప్తంగా

ద్విచక్రవాహనాల చోరీ కేసులో వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

కుప్పం: గుడుపల్లి మండలంలో రెండు రోజులుగా జరిగిన ద్విచక్ర వాహనాల చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ మల్లేష్ యాదవ్ తెలిపారు. మూడు రోజులు క్రితం గుడుపల్లిలో జరిగిన ద్విచక్ర వాహనాల చోరీ కేసు విచారణలో భాగంగా పాగురుపల్లె క్రాస్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా చోరీకి గురైన వాహనాలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. కుప్పం మండలం మోడల్ కాలనీకి చెందిన సతీష్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపాడు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు రెడ్డి

పెద్దపంజాణి: చౌడేపల్లి–పుంగనూరు మార్గం మధ్యలోని మల్లసముద్రం వద్ద గురువారం ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. చౌడేపల్లి మండలం చారాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు శ్రీనివాసులు రెడ్డి(మాజీ సైనికుడు)పెద్దపంజాణి మండలం రాజుపల్లి పంచాయతీ కమ్మినాయునిపల్లి సమీపంలోని హెచ్‌పీసీఎల్ పంపింగ్ స్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో పని ముగించుకుని, ఎలక్ట్రిక్ స్కూటర్‌లో స్వగ్రామం చారాలకు బయలు దేరాడు. మార్గం మధ్యలోని మల్లసముద్రం వద్ద పుంగనూరుకు వెలుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు రెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య

వెదురుకుప్పం: కుటుంబ కలహాల నేపథ్యంలో కొండకిందపల్లె గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కొండకిందపల్లె గ్రామంలోని హేమలత(29)కు, కార్వేటినగరం మండలం జొండ్లపేట గ్రామానికి చెందిన నరేష్‌కు ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. అయితే గత ఆరు నెలలుగా వారిద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో నరేష్ విడాకులు ఇవ్వాలని కోరాడు. హేమలత కుటుంబ సభ్యులు ఒక్కటి చెయ్యాలని ప్రయత్నాలు చేసినా ప్రయోజనం లేకపోగా మనస్తాపం చెందిన హేమలత గురువారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు.

కూటమి అండ.. దోపిడీ కొండ!



అనుమతి గోరంత.. తవ్వేది అంతా..! అన్నట్టుగా తయారైంది వడమాలపేట మండలంలో మైనింగ్ లీజు పరిస్థితి. తిరుమండ్యం గ్రామంలో 7.5 ఎకరాలకు అనుమతి తీసుకుని దాదాపు పది ఎకరాలకుపైగా తవ్వేసినా ఎవ్వరూ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న దృశ్యం

- కోట్ల విలువ చేసే రాతి సంపద దోపిడీ
- కూటమి అండతో విచ్చలవిడిగా రవాణా
- తిరుమండ్యం కొండలో అక్రమ తవ్వకాలు
- చోద్యం చూస్తున్న మైనింగ్ అధికారులు
- భారీ పేలుళ్లతో బీటలు వారిన నివాసాలు
- దుమ్ము ధూళితో దిగుబడి తగ్గుతోందంటున్న రైతన్నలు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం, తిరుమండ్యం గ్రామంలో మైనింగ్ మాఫియా రెచ్చిపోతోంది. అనుమతికి మించి కొండను పిండి చేస్తూ విలువైన రాతి సంపదను కొల్లగొడుతోంది. తిరుమండ్యం గ్రామ లెక్కదాఖలాలో సర్వే నం.175లో సుమారు 116 ఎకరాల గుట్ట పోరంబోకు ఉండగా.. అందులో 2.96 హెక్టార్లు (సుమారు 7.5 ఎకరాలు) మైనింగ్ నిమిత్తం లీజుకు తీసుకున్నారు. కొండను తవ్వి నెలకు సుమారు 45 వేల టన్నుల వరకు తరలిస్తున్నారు. ఇప్పటికే వారికి ఇచ్చిన పరిధిని దాటేశారు. దాదాపు 10 ఎకరాల మేరకు విస్తరించి తవ్వకాలు జరుపుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవు. క్వారీదారుకు అధికార పార్టీ నేతల అండ ఉండడంతో మైనింగ్ శాఖ అధికారులు మొక్కుబడి తనిఖీలు, నోటీసులతో సరిపెట్టేస్తున్నారు. 'మేము తనిఖీలు చేస్తుంటాం... మీరు తరలిస్తూ ఉండండి' అన్నచందంగా పరస్పర ఒప్పందంతో ఈ దందా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక లోడ్డుకు బిల్లు చూపి.. పది లోడ్ల కంకర అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడం గమనార్హం.

తవ్వేసి..మింగేసి!

లీజు తీసుకున్నవారికి పదేళ్లవరకు కంకర తరలింపుకు అనుమతి ఉంటుంది. కేటాయించిన విస్తీర్ణములో మాత్రమే రాళ్లను తవ్వి తరలించాలి. అలా తరలించే రాళ్లకు క్వారీదారు టన్నుకు రూ.150 చొప్పున ప్రభుత్వానికి చెల్లించాలి. అదే టన్నుకు బయట రూ.2,100 నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. నెలకు 45 వేల టన్నుల రాళ్లను తరలిస్తుండగా అందులో 20 నుంచి 30 శాతానికి మాత్రమే రూ.150 చొప్పున చెల్లిస్తున్నారు. దీంతో కోట్ల రూపాయల సొమ్ము క్వారీదారు జేబుకు చేరుతోంది. అందులో అధికార పార్టీ నేతలు వాటాలు పంచుకుంటున్నట్లు సమాచారం.

పడగవిప్పుతున్న పర్యావరణ కాలుష్యం

ఒకవైపు ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంటే మరోవైపు సమీప గ్రామస్తులను పర్యావరణ కాలుష్యం గుదిబండగా మారింది. ఈ కార్వీకి 200 మీటర్ల దూరంలో దివంగత మహానేత వైఎస్సార్ ప్రభుత్వంలో పేదలకు నిర్మించిన 25 నివాసాలు ఉన్నాయి. క్వారీలో రాళ్లను పేల్చడానికి వాడాల్సిన నమోదుకంటే ఎక్కువ నమోదులో పేలుడు పదార్థాలు వాడడంతో ఆ ప్రకంపనలకు సమీప ప్రాంతాలు కంపించిపోతున్నాయి. ఇప్పటికే 20 ఇళ్ల బీటలు వారిపోయాయి. రాత్రిపూట కంటిపై కునుకు లేకుండా పోతోందని స్థానిక భయాందోళన చెందుతున్నారు. క్వారీకి చుట్టుపక్కల సుమారు 300 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. రైతులు మామిడి, వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. ఆ పంటలపై క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళి పడడంతో దిగుబడి తగ్గిపోతోంది. సుమారు 20 ఎకరాలలో దిగుబడి దారుణంగా పడిపోయింది. అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పంట దిగుబడి రావడం లేదు



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. అందులో ఒక ఎకర మామిడి తోట వేసుకోగా, మిగిలిన భూమిలో వరి సాగు చేసుకొని జీవనం సాగించేవాడ్ని. క్వారీ నుంచి వచ్చే దుమ్ము ధూళి పంటలపై పడి దిగుబడి చాలావరకు తగ్గిపోయింది. మామిడి చెట్లకు పూత రావడం లేదు. వచ్చే పూత కూడా రాలిపోతోంది. నష్టాలపాలవుతున్నాను. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

–ధనంజయులురెడ్డి, తిరుమండ్యం

ఇళ్లు పగుళ్లుబారుతున్నాయి



గతంలో ఈ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకున్నాను. కొండపై క్వారీకి అనుమతి ఇచ్చాక పెద్ద ఎత్తున పేలుళ్లు చేస్తున్నారు. అక్కడి నుంచి ఇళ్లు ఉండే ప్రాంతం వరకు అదురుతోంది. నివాసాలు పగుళ్లుబారుతున్నాయి. నా ఇంటికి కూడా పగుళ్లు వచ్చాయి. దాదాపు అన్ని ఇళ్లకు పగుళ్లు ఉన్నాయి.

– జయమ్మ, తిరుమండ్యం.

సాగు చేయడం మానుకున్నా



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి, నువ్వులు, వేరుశనగ సాగు చేస్తుంటాను. ఇటీవల క్వారీ నుంచి వచ్చే దుమ్ముధూళి పంటపై పడడంతో సాగుచేయడం మానుకున్నాను.

– గురుప్రసాద్, తిరుమండ్యం

తనిఖీ నిర్వహిస్తాం

క్వారీకి ఇచ్చిన విస్తీర్ణం కన్నా ఎక్కువగా కొండను తొలిచేస్తున్నారా..? అనే అంశంపై మైనింగ్ వారికి తెలియజేసి తనిఖీ నిర్వహిస్తాం. ఎక్కువ విస్తీర్ణంలో కొండను తొలిచినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం. మోతాదుకు మించి పేలుళ్లు జరిపితే కఠిన చర్యలు తప్పవు.

–జరీనా, తహసీల్దార్, వడమాలపేట



బీటలు బారిన ఇంటి గోడలు



తిరుమండ్యం గుట్టలో క్వారీ తవ్వకాలు



ఏర్పడిన భారీ గోతులు



బండరాళ్లను పగులగొడుతున్న యంత్రం

పకడ్బందీగా కిశోరి వికాసం శిక్షణ

- పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే కిశోరి వికాసం వేసవి శిక్షణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో కిశోరి వికాసం శిక్షణ పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక వేసవి శిక్షణ గ్రామ, వార్డు స్థాయిలో కిశోరి బాలికల సాధికారతకు రూపొందించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో విద్య ప్రాముఖ్యత, వ్యక్తిగత పరిశుభ్రత, ఉన్నత విద్య, బాల్యవివాహాల నిర్మూలన సహా ఇతర అంశాలపై వేసవి సెలవుల్లో శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ జిల్లాలోని అంగన్‌వాడీ, సచివాలయ కేంద్ర పరిధిలో ఇస్తారన్నారు. మే2 నుంచి జూన్ 10 వరకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుబ్రమణ్యం, లీగల్ ఆఫీసర్ వెంకటేష్, ప్రొటెక్షన్ అధికారులు శివ, రాధ పాల్గొన్నారు.

పోరంబోకు భూమి ఆక్రమణ

గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం రెవెన్యూ నాగూరుపల్లె సర్వే నంబర్ 893 /2లో 7.37 ఎకరాల పోరంబోకు భూమి ఆక్రమణలకు గురైంది. ఈ భూమి ఎన్నో తరతరాలుగా చుట్టుపక్కల గ్రామస్తులు పశువుల మేత కోసం వాడుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొందరు కూటమి నేతల దీనిపై కన్ను వేశారు. నకిలీ పట్టా సృష్టించి, దాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచి అదే గ్రామానికి చెందిన అమరావతమ్మ పేరున రిజిస్ట్రేషన్ చేశారని, తరువాత అమరావతమ్మ నుంచి తన కోడళ్లకు రిజిస్ట్రేషన్ చేశారని, ప్రస్తుతం ఆ భూమిలో అమరావతమ్మ కుటుంబసభ్యులు భారీ యంత్రాలతో చదును చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. దీంతో తాము అడ్డుకోగా తమకు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల అండదండలున్నాయని దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. పలుమార్లు స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఎలాంటి చర్యలు చేపట్టక పోగా ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు మండిపడ్డారు. సదరు భూమిపై సమాచార హక్కు చట్టం కింద ఫిర్యాదు చేయగా మండల రెవెన్యూ కార్యాలయం నుంచి సదరు సర్వే నంబర్‌పై ఎలాంటి సబ్ డివిజన్ చేయలేదని, ఎవరికి ఎలాంటి పట్టా ఇవ్వలేదని సదరు సర్వే నంబర్ పోరంబోకు భూమి అని స్పష్టం చేశారు. కాగా సదరు భూమిపై అమరావతమ్మ కుటుంబ సభ్యులకు హక్కులు ఎలా కల్పిస్తారని, తహసీల్దార్, రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకే వత్తాసు పలుకుతూ వారి మాటే చెల్లుబాటు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

క్రీడలతో ఉజ్వల భవిత: డీఎస్‌డీఓ బాలాజీ



మాట్లాడుతున్న డీఎస్‌డీఓ బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) బాలాజీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెసానిక్ మైదానంలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెలవులను వృథా చేయకుండా క్రీడా శిబిరంలో క్రీడల్లో శిక్షణ పొందాలన్నారు. క్రీడల్లో పట్టు సాధిస్తే ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. అనంతరం పలు క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త జయప్రకాష్‌నాయుడు, ఇండియన్ బ్యాంక్ రిటైర్డ్ రీజినల్ మేనేజర్ నాగరాజు, షణ్ముగం, రాజా, కోదండరామస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకునిపై హత్యాయత్నం

- గంగమ్మ చాటులో దాడి చేసిన ఓ గ్యాంగ్
- నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు



సునీల్‌కుమార్‌పై దాడి చేస్తున్న హంతకులు



గాయపడిన సునీల్‌కుమార్

పలమనేరు: పట్టణంలో గంగమ్మ చాటు సందర్భంగా ఓ యువకునిపై కొందరు మారణాయుధాలతో హత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పలమనేరు సీఐ నరసింహరాజు కథనం మేరకు.. పట్టణానికి చెందిన గాంధీనగర్ వాసి సునీల్‌కుమార్(27) పాతపేటలోని ఓ గ్యాస్‌గోడౌన్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గంగమ్మ జాతర చాటింపు సందర్భంగా సునీల్‌కుమార్ ఇంటికి వెళుతుండగా అతన్ని టార్గెట్ చేసిన కొందరు మారణాయుధాలతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో అతన్ని స్థానికులు ఇక్కడి ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి మొండోళ్ల కాలనీకి చెందిన కళ్యాణ్, అతని సన్నిహితులైన పవన్, సాయి, హరి కత్తులు, రాడ్లు, బ్లేడ్లతో దాడి చేసినట్టు సీఐ తెలిపారు. ఇప్పటికే నిందితులను గుర్తించామని, వీరితోపాటు మరికొందరు ఉన్నారని తెలిపారు. ఈ ఘటన పాతకక్షల కారణంగా జరిగినట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. పట్టణంలో రౌడీయిజం సహించే ప్రసక్తే లేదని నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు.. డ్రైవర్‌కు గాయాలు




దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

పాలసముద్రం : ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొనడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా, ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం పాలసముద్రం మండలంలో చోటు చేసుకుంది. పల్లిపట్టు ఎస్‌ఐ రమేష్ కుమార్ కథనం మేరకు.. తిరుపతి నుంచి వెంగళరాజుకుప్పం గ్రామానికి ఏపీ 26 జెడ్‌ఓ 162 ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. తమిళనాడు వడకుప్పం వద్దకు రాగానే బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొంది. దీంతో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయ్యింది. బస్సు డ్రైవర్ రామమూర్తి సీట్‌లో ఇరుకుపోయాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. కాగా బస్సులోని మునస్వామి, చంద్రశేఖర్ అనే ప్రయాణికులకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు డ్రైవర్‌ని బయటకు తీసి, తిరుత్తణి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పల్లిపట్టు ఎస్‌ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

వ్యక్తికి గాయాలు

పుంగనూరు: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడడంతో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని చదళ్ల సమీపంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సోమల మండలానికి చెందిన శ్రీనివాసులు(45) తన టమాట పంటకు పుంగనూరు పట్టణంలో క్రిమిసంహారక మందు కొనుగోలు చేసి, తిరిగి సోమల వైపు వెళుతుండగా ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీర్ దుర్మరణం



రవితేజ మృతదేహం

పుంగనూరు: రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన పట్టణంలోని బాలాజీ థియేటర్ వద్ద గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని అండిగానిపల్లికు చెందిన రవితేజ(24) బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. రవితేజ స్వగ్రామానికి వచ్చి తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో పుంగనూరు పట్టణానికి వచ్చాడు. బాలాజీ థియేటర్ వద్ద వెళుతుండగా అతివేగంగా వస్తున్న ప్రైవేటు బస్సు రవితేజ వాహనాన్ని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరుగున వచ్చి కుప్పకూలిపోయాడు!

పూతలపట్టు (కాణిపాకం): చిత్తూరు–తిరుపతి జాతీయ రహదారిపై పూతలపట్టు పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం ఓ లారీ డ్రైవర్ తన వాహనాన్ని ఆపి, సమీపంలో ఓ ప్రైవేట్ క్లినిక్ వద్దకు పరుగున వెళ్లి కుప్పకూలిపోయి మృతి చెందారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పూతలపట్టు మండలంలోని ఓ ప్రైవేటు పాల డెయిరీకి సంబంధించిన లారీకి తమిళనాడు రాష్ట్రం తిరువరం జిల్లా మైలాడవరానికి చెందిన మదిఆలగన్ (52) డ్రైవర్ గా పనిచేస్తున్నారు. డెయిరీ వద్దకు లారీని తీసుకెళుతుండగా మార్గంమధ్యలో పూతలపట్టు పోలీస్ స్టేషన్ సమీపంలోకి రాగానే వాహనాన్ని ఆపి వేసి సమీపంలోని ప్రైవేటు క్లినిక్ వద్దకు వెళ్లి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆర్ఎంపీ వైద్యుడు ప్రాథమిక చికిత్సకు ప్రయత్నించగా మృతి చెందారని నిర్ధారించి, పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా రెండు రోజులుగా జ్వరం ఉందని, ఆస్పత్రిలో చూపించుకుని ఇంటికొస్తానని కుటుంబసభ్యులకు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

4న ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ (సీడీసీఏ) అధ్యక్షుడు బీ.విజయ్‌కుమార్, కార్యదర్శి ఎస్.రవికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా అండర్–19 బాలురు, అండర్–23 పురుషులు, అండర్–15 బాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అండర్–19కు 01-09-2006, అండర్–23కు 01-09-2002 తరువాత జన్మించిన వారు, అండర్–15కు 01-09-2010 తరువాత 31-08-2012లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు తెల్లని దుస్తులు, సొంత క్రికెట్ కిట్, ఆధారు కార్డు, బర్త్ సర్టిఫికెట్లను తప్పనిసరిగా తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సీడీసీఏ కోచ్ జీ.సునీల్ కుమార్‌ను 90002 14966, సీడీసీఏ అసోసియేట్ సంయుక్త కార్యదర్శి ఎం.సతీష్‌యాదవ్‌ను 88861 85559 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

ఎంపిక పోటీలు ఇక్కడే

చిత్తూరు, మదనపల్లి డివిజన్ల పరిధిలో వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ గ్రౌండ్‌లో ఉదయం 9గంటలకు అండర్–19(బాలురు), అండర్15 (బాలికలు), మధ్యాహ్నం 2గంటలకు అండర్–23 (పురుషులు), తిరుపతి డివిజన్‌కు సంబంధించి తిరుపతి, మంగళం రోడ్డులోని సీవీ క్రికెట్ అకాడమీలో ఉదయం 9 గంటలకు అండర్–19(బాలురు), అండర్15(బాలికలు), మధ్యాహ్నం 2గంటలకు అండర్–23(పురుషులు)జట్లు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు.

విద్యాశాఖ ఏడీ–1గా సుకుమార్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఏడీ–1గా యూజే సుకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో విధులు నిర్వహించిన ఆయన చిత్తూరు విద్యాశాఖ ఏడీ 1గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన విధులు స్వీకరించిన అనంతరం డీఈఓ వరలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీచర్ల సమస్యల పరిష్కారానికి, ఉన్నతాధికారుల ఉత్తర్వులు ఎప్పటికప్పుడు అమలు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఆయన్ని ఏడీ–2 వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు సత్య, వీజీ రమణ, సిబ్బంది మురళి, గోపాల్ లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కౌండిన్యలో ఏనుగుల సంచారం



మొగిలి దేవరకొండ అడవిలో సంచరిస్తున్న ఏనుగులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి దేవరకొండ అటవీ ప్రాంతంలో గురువారం సాయంత్రం రెండు ఏనుగులు సంచరిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. దేవరకొండ సమీపంలో గల కౌండిన్య అడవిలో ఏనుగులు తిరుగుతున్నాయన్నారు. బుధవారం సాయంత్రం మొగిలి సమీపంలోని గానిచెరువులో ఏనుగులు నీటిలో సేదతీరి అడవిలోకి వెళ్లిపోయాయి. తిరిగి రాత్రి మొగిలి గ్రామంలోని శ్రీనిఫుడ్ ఫ్యాక్టరీ వద్దకు రెండు ఏనుగులు ప్రవేశించి హల్‌చల్ చేయడంతో సెక్యూరిటీ, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఏనుగుల రాకను గుర్తించి కేకలు వేయడంతో అడవిలోకి వెళ్లిపోయాయి. ఏనుగులు దేవరకొండ ప్రాంతంలో తిరుగుతున్నాయని తెలిపారు. ఏనుగులు సంచారంతో అడవిలోకి ఎవరూ వెళ్లరాదని ఫారెస్టు అధికారులు హెచ్చరిస్తున్నారు.

తాటి చెట్టు నుంచి పడి వ్యక్తి మృతి

గంగవరం: తాటి చెట్టు నుంచి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మేలుమాయి క్రాస్‌లో నివాసం ఉంటున్న మునేంద్ర(28) వృత్తి రీత్యా కూలి. గత బుధవారం కీలపల్లి గ్రామం వద్ద తాటి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కాలుజారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎస్ ఉద్యోగుల హామీలు నెరవేర్చాలి

- కలెక్టరేట్ ఎదుట ఏపీసీపీఎస్‌ఈఏ నాయకుల ధర్నా



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సీపీఎస్ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీసీపీఎస్‌ఈఏ రాష్ట్ర అధ్యక్షులు బాజీ పఠాన్, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆ సంఘ నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 3.5 లక్షల సీపీఎస్ ఉద్యోగులను ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా మార్చే విధానాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అపరిష్కృత సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వం చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేరన్నారు. సీపీఎస్ ఉద్యోగులు ఆర్థికంగా, సామాజికంగా, ఒత్తిడిని ఎదుర్కొంటున్నారన్నారు. సీపీఎస్ ఉద్యోగులు పరిస్థితిని మేడే రోజున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ధర్నా నిర్వహించామన్నారు. సీపీఎస్ అసోసియేషన్ జిల్లా నాయకులు సీపీఎస్ అమలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు సమస్యలు కుప్పలు తెప్పలుగా పెరగడమే కానీ ఒక్క సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం చెప్పే మాటలు, చేసే పనులకి పొంతన లేకుండా ఉందన్నారు. ఎన్నికల సమయంలో సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేర్చాలన్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నాలో ఆ సంఘం నాయకులు దేవకుమార్, హరిప్రసాద్‌రెడ్డి, మోహన్‌కుమార్, నరసింహులు, సుబ్బలక్ష్మి, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.